సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 29 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.24 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 101 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23
అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టం రూ.6, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.6°/23.4°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మట్టి వినాయకుడిని పూజించాలి



'మట్టి వినాయకుడి పూజిద్దాం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: వినాయక చతుర్థిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో వినాయక చతుర్థి, దుర్గ పూజ సందర్భంగా వినాయక విశిష్టతను తెలియజేసేలా రూపొందించిన పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సహజ రంగులతో చేసిన మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు జరుపుకోవాలన్నారు. చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. వినాయకుడి తయారీకి పత్తి, నార, బంక మట్టిని వినియోగించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: వాతావరణ మార్పులతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 10 మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. నల్లమాడ మండలంలో అత్యధికంగా 16.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే సోమందేపల్లి మండలంలో 16.2 మి.మీ, లేపాక్షి 15.4, హిందూపురం 13.4, కదిరి 7.2, రొళ్ల 7.2, పెనుకొండలో 7.0, చిలమత్తూరు 6.8, పరిగి 4.2, గాండ్లపెంట 2.0 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాగల మూడు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కదిరి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం (30వ తేదీ) సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వ్రతంలో పాల్గొనాలనుకునే వారు ముందుగా ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు కలశపూజ, 10 గంటలకు వరలక్ష్మీవ్రతం ఉంటుందన్నారు. వ్రతం ఆచరించే మహిళలు కలశము కోసం చెంబు, పూజ సామగ్రి, పూలు, పండ్లు తెచ్చుకోవాలన్నారు.

టీడీపీ నేత అక్రమ మద్యం దందా

- జాతీయ రహదారి పక్కనే విక్రయాలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- భారీగా అక్రమ మద్యం స్వాధీనం..!

ధర్మవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు అక్రమార్జనకు అడ్డదారులన్నీ తొక్కుతున్నారు. బత్తలపల్లికి చెందిన ఓ టీడీపీ నేత ఏకంగా చెన్నై జాతీయ రహదారి పక్కనే అక్రమ మద్యం విక్రయిస్తూ పోలీస్ దాడుల్లో దొరికిపోయినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు... బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నది సమీపంలో ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ సామగ్రి భద్రపరుచుకునేందుకు రేకుల షెడ్లు వేసింది. వాటి సమీపంలో బత్తలపల్లి మండలానికి చెందిన ఓ టీడీపీ నేత నిత్యవసర వస్తువుల దుకాణం నడుపుతున్నారు. ఈ దుకాణంలోనే మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. మద్యం దుకాణంలో సైతం లభించని బ్రాండ్లు టీడీపీ నేత దుకాణంలో లభిస్తుండటంతో జనమంతా అక్కడికే వచ్చి అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం రాత్రి మెరుపుదాడి చేశారు. టీడీపీ నేతను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దుకాణంలో సోదాలు నిర్వహించగా ప్రభుత్వ మద్యం దుకాణంలో విక్రయించే అన్ని రకాల మద్యం లభ్యమైనట్లు సమాచారం. వాటిని స్వాధీనం చేసుకుని సదరు టీడీపీ నేతను ధర్మవరం తరలించినట్లు సమాచారం. అయితే ఈ విషయం బయటకు పొక్కనివ్వని పోలీసులు... అక్రమ మద్యం దందాను బహిర్గతం చేస్తారా..? లేక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా.. అన్నది తేలాల్సి ఉంది.



వైద్యులకు భరోసా కల్పించాలి

"వైద్యులు భయంతో సేవలందించే పరిస్థితి ఉండకూడదు. కఠినమైన చట్టాలతోనే ఇది సాధ్యం. ముఖ్యంగా మహిళా వైద్యులపై దాడులను అరికట్టేందుకు మరింత కఠినమైన చర్యలు అవసరం. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సిబ్బంది రక్షణకు తగు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా రాత్రి వేళ విధుల్లో ఉండే మహిళా సిబ్బందికి భద్రత మరింత పెంచాలి.

– డాక్టర్ శివకుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, హిందూపురం

సమాజం నుంచి వెలివేయాలి

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు పాల్పడిన నిందితులను సమాజం నుంచి వెలివేయాలి. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన శిక్షలు విధించాలి. మహిళా వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలోనూ భద్రతను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సీసీ కెమెరాలు బిగించాలి. అలాగే రాత్రి వేళల్లో ఆస్పత్రుల వద్ద రక్షణ కోసం పోలీసులను నియమించాలి."

– డాక్టర్ తనూజ, ధర్మవరం



'తమ్ముళ్ల' భూదందా



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం కొత్తగ్యాదికుంటలో దళిత సామాజికవర్గానికి చెందిన శివయ్య, పెద్దక్క దంపతులు. వీరు పొలాన్ని 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఇటీవల బోర్లు వేసుకుని చీనీ, అనప పంట సాగు చేస్తున్నారు. వీరి భూమిని పరిటాల సునీత అనుచరులు లాక్కున్నారు. ట్రాక్టర్లతో పంటలను కూడా దున్నేశారు. భూమి జోలికి రాకూడదని హెచ్చరించారు. దీంతో ఎలాంటి అండదండల్లేని బాధితులు న్యాయం కోసం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.



రామసాగరం చెరువును ఓ వైపున పూడ్చి వేసిన దృశ్యం

పుట్టపర్తి నియోజకవర్గం బుక్కపట్నం మండలం రామసాగరం గ్రామంలో కొందరు టీడీపీ నాయకులు చెరువు భూమిని ఆక్రమించారు. పక్కనే ఉన్న మట్టిని తెచ్చి.. చెరువులో కొంతభాగాన్ని పూడ్చి వేశారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అయితే ఆ తర్వాత ఎలాంటి చర్యలు లేవు. టీడీపీ నేతలు కూడా అక్కడితో చెరువు కబ్జా ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకున్నారు.,

ధర్మవరానికి సమీపంలోని రేగాటిపల్లి కొండ నుంచి మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రింబవళ్లు మట్టి తవ్వకాలు జరుగుతున్నా... అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంలో కూటమిలో భాగమైన జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే మట్టి దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



రేగాటిపల్లి కొండ వద్ద హిటాచీలతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

- అసైన్డ్ భూముల ఆక్రమణ
- వివాదం లేకున్నా పంచాయితీ
- ఆన్‌లైన్‌లో పేర్ల మార్పిడితో టోకరా
- అన్నదమ్ముల మధ్య చిచ్చుపెడుతున్న వైనం
- కుటుంబాలకు రాజకీయ రంగు పూస్తూ దందా
- 'కూటమి' ఏర్పడ్డాక ప్రతి నియోజకవర్గంలోనూ భూ తగాదాలే

సాక్షి, పుట్టపర్తి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు దందా మొదలుపెట్టారు. ఏ నియోజకవర్గంలో చూసినా.. భూములు కబ్జా చేయడం, ప్రభుత్వ భూముల్లో పాగా వేయడం, ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు చేయడం, ఎలాంటి వివాదాలు లేని భూములకూ వారే ఇబ్బందులు కలిగించి పంచాయితీలు చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లో పంటలు సాగులో ఉన్నా.. దున్నేసి స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అడిగిన వారిపై దాడికి దిగుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేల అనుచరులు కబ్జాలు విచ్చలవిడిగా చేస్తున్నారు. భూముల విలువ అధికంగా ఉన్న చోట.. వచ్చిన కాడికి దోచుకుందామనే పనిలో పడ్డారు. అమాయకుల పేర్ల మీద ఉన్న భూములను బెదిరించి లాక్కుంటున్నారు. జిల్లా పరిధిలో పుట్టపర్తి, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో ఇలాంటి ఘటనలు అధికంగా వెలుగు చూశాయి.

వివాదం లేకున్నా సృష్టిస్తూ..

అన్నదమ్ములకు సమానంగా భూముల పంపకాలు జరిగి ఉంటాయి. అలాంటి పంచాయితీల్లో తెలుగు తమ్ముళ్లు వేలు పెడుతున్నారు. ఒకరి వైపు నిలబడి.. కొంత ఎక్కువ మేర భూమి ఇవ్వాల్సి ఉంటుందని రెచ్చగొడుతున్నారు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదం లేకున్నా.. రాజకీయ రంగు పూసి.. గొడవలు సృష్టిస్తున్నారు. ఇలాంటి ఘటన కనగానపల్లి మండలంలో వెలుగు చూసింది. అన్నదమ్ముల్లో ఒకరికి ఆస్తి ఎక్కువగా ఉందని.. పైగా ఆయన వైఎస్సార్‌సీపీ నేత అని ముద్ర వేశారు. తమ్ముడిని టీడీపీ సానుభూతిపరుడిగా చెబుతూ అతనికి ఎక్కువ భూమి పంచాలని 'తెలుగు తమ్ముళ్లు' పంచాయితీ పెట్టారు. దీంతో అన్నదమ్ముల మధ్య రాజకీయ చిచ్చురేగింది. నేటికీ ఆ పంచాయితీ తెగడం లేదు.

ఆన్‌లైన్‌లో కనిపించకుండా..

తమ్ముళ్ల భూదందాతో ఏళ్లుగా ఉన్న భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు కనిపించకుండా పోతున్నాయి. పట్టాదారు పాసుపుస్తకం ఉన్నప్పటికీ.. వన్‌బీ, అడంగల్ రాకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా అధికారులను అడ్డుపెట్టుకుని భూ దందా సాగిస్తున్నారు. సదరు స్థలంలో వివాదంలో ఉందని చూపుతూ ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించాలని ఆదేశిస్తున్నారు. ఇలాంటి ఘటన కొత్తచెరువు మండలంలో వెలుగు చూసింది.

పేర్లు మార్పు చేస్తూ..

దశాబ్దాల తరబడి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండి.. పంట సాగు చేస్తున్నా.. రాత్రికి రాత్రే ఆన్‌లైన్‌లో వేరే వ్యక్తి పేరిట భూమి చూపిస్తున్నారు. యజమానికి తెలియకుండా అధికారులకు లంచాలు ఇచ్చి.. కృత్రిమ వివాదం సృష్టించి.. భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటిది చిలమత్తూరు మండలం కొడికొండ గ్రామంలో వెలుగు చూసింది. దీనిపై బాధితురాలు కలెక్టరేట్‌ను ఆశ్రయించింది. ఇలాంటి ఘటనలే రాప్తాడు నియోజకవర్గంలోనూ భారీగా వెలుగుచూస్తున్నాయి.

ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర బృందం



పట్నం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ బృందం సందర్శించింది. డా.అగస్టిన్ జోసెఫ్, డా.హర్షలా సుధాకర్, దీపక్ సభ్యులు గల బృందం వైద్యసేవలు, సౌకర్యాలపై ఆరా తీసింది. రోగులకు అందుతున్న వైద్య సేవలను బృందం సభ్యులు స్వయంగా పరిశీలించారు. రోజూ ఎంతమందికి ఓపీ సేవలు అందిస్తున్నారని వైద్యురాలు ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని విభాగాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేంద్రం బృందం వెంట వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్ మాట్లాడుతూ, నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ బృందం సభ్యులు ఆస్పత్రి ద్వారా అందే వైద్యసేవలు, సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారని, ఈ మేరకు వారు ఆస్పత్రికి గ్రేడింగ్ ఇస్తారన్నారు. మెరుగైన గ్రేడ్ దక్కితే కేంద్రం నుంచి ఆస్పత్రికి ప్రోత్సాహక నిధులు మంజూరవుతాయన్నారు. దీంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. కేంద్ర బృందం పరిశీలన రెండు రోజుల పాటు సాగుతుందన్నారు.

రేపు సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థలో ఈ నెల 30న సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి ఆదేశాల ప్రకారం కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు నగరపాలక సంస్థలోని న్యూ కాన్ఫరెన్స్ హాలులో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, శానిటేషన్ కార్యదర్శులకు, కౌన్సిల్ హాలులో ప్లానింగ్ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు సంబంధించి దాదాపు 150 మంది వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, శానిటేషన్, ప్లానింగ్ కార్యదర్శులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

తల్లి సాయంతో తండ్రిని హతమార్చిన కుమారుడు



మృతుడు తిప్పేస్వామి నాయక్ (ఫైల్)

బెళుగుప్ప: కన్న కొడుకే తండ్రిని హతమార్చిన ఘటన మండల పరిధిలోని యలగలవంక తండా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. యలగలవంక తండా గ్రామానికి చెందిన తిప్పేస్వామినాయక్ (53), లక్ష్మీబాయి దంపతులకు ఒక కుమారుడు రాజశేఖర్‌నాయక్, కుమార్తె జ్యోతిబాయి ఉన్నారు. మద్యానికి బానిసైన రాజశేఖర్‌నాయక్ అప్పులు ఎక్కువగా చేశాడు. దీంతో పాటు ఇష్టారాజ్యంగా తిరుగుతుండడంతో తండ్రి మందలించేవాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో మారెమ్మ జాతర జరిగింది. ఈ సందర్భంగా ఇద్దరూ మద్యం సేవించి రాత్రి గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన రాజశేఖర్ నాయక్ తన తండ్రి తిప్పేస్వామినాయక్ గొంతు నులిమి హతమార్చాడు. గొడవలో తల్లి లక్ష్మీబాయి కూడా కుమారుడికి సహకరించినట్లు తెలిసింది. ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్ తదితరులు

- సెప్టెంబర్ 17లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచన

పుట్టపర్తి అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 90 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ చేతన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు కనీసం ఇద్దరు చొప్పున టీంగా ఏర్పడి సెప్టెంబర్ 17వ తేదీలోపు https:// www. rbi90 quiz. in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జాతీయ, జోనల్, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు ఉంటాయన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలచిన వారికి రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలు చొప్పున, జోనల్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 లక్షలు, రూ.4 లక్షలు, రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతులు ఉంటాయన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.2 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్ష చొప్పున బహుమతులు ఉంటాయని వెల్లడించారు. విద్యార్థుల్లో రిజర్వు బ్యాంక్, ఆర్థిక పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు క్విజ్ నిర్వహిస్తున్నట్లు ఎల్‌డీఎం రమణకుమార్ తెలిపారు.

పరిశ్రమల్లో మాక్‌డ్రిల్ తప్పనిసరి

- విపత్తులు ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: విపత్తులు సంభవించినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పరిశ్రమల్లో విపత్తులు సంభవించినప్పుడు ఏదైనా ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సమీక్షించారు. ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి కేశవులు, జీఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో పూర్తి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. రెడ్ కేటగిరీల్లో ఉన్న పరిశ్రమల్లో రక్షణ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్, ప్రొటోకాల్, కచ్చితంగా పాటించాలన్నారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రతి పరిశ్రమలోనూ సేఫ్టీ అధికారిని నియమించుకునేలా చూడాలన్నారు. ఆ తర్వాతే జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎన్‌ఓసీ మంజూరు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సేవలు అందించడానికి సమీపంలో ఆస్పత్రులు, పోలీస్, అత్యవసర సేవలను అందించే శాఖల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదం, విపత్తు జరిగినప్పుడు ఎలా స్పందించాలన్నదానిపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. వాహన ప్రవేశ మార్గాలకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదాల సమయంలో కార్మికులను, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడానికి అలారం ఏర్పాటు చేయాలన్నారు. మాక్ డ్రిల్ సమయంలో సమీపంలోని పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ, పరిశ్రమల్లో మానవ వనరుల సంరక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.



ఉట్టిమాను ఎక్కుతున్న యువకులు

ఉత్సాహంగా ఉట్లోత్సవం

కదిరి టౌన్: కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉట్లోత్సవం ఉత్సాహంగా సాగింది. ఆలయ అధికారులు ఆవరణలో ఉట్టిమాను ఏర్పాటు చేయగా, కాలేపల్లికి చెందిన యాదవ కులస్తులు ఉట్టిమానుకు పూజలు చేశారు. అనంతరం ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. పైకి ఎక్కుతూ పట్టుతప్పి కిందపడిపోతూ అందరికీ ఆనందం పంచారు. ఉత్సవం సందర్భంగా అర్చకులు ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశుడు

క్లుప్తంగా

అనాథలకు నిత్యావసరాలు అందించండి

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఉన్న అనాథ పిల్లలకు రేషన్, ఆధార్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా పంచాయతీ, సివిల్ సప్లయిస్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అభాగ్యులను ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రామాపురం వద్ద బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇసుకను అక్రమంగా ఎవరు తరలించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇసుక రీచ్ పాయింట్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకను తీసుకెళ్లాలన్నారు. ఇసుక తీసుకువెళుతున్న సమయంలో అందుకు సంబంధించిన రసీదులను చూపాల్సి ఉంటుందన్నారు. అలా కాకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

వైభవంగా గంధం వేడుకలు

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గంధం వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల వాహనంలో అల్లప్పరెడ్డి ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం అమ్మవారి సమాధి వద్ద గంధం ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దర్గా పరిసరాలు జనసంద్రమయ్యాయి.



భద్రత కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన పాశవిక ఘటన చాలా దుర్మార్గం. ప్రాణాలను కాపాడే డాక్టర్లకే భద్రత కల్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ఇటీవల మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. రోజూ ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మహిళలకు భద్రత పెంచాలి. శిక్షలు కఠినతరం చేయాలి. ఆస్పత్రుల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ రవినాయక్, ఎస్ఎస్‌గేట్ పీహెచ్‌సీ, చెన్నేకొత్తపల్లి మండలం



దాడులు సరికాదు

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఇప్పటికైనా ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అత్యవసర సమయంలో సరైన చికిత్స అందించి రోగి ప్రాణాలు కాపాడే వైద్యులు, సిబ్బంది పట్ల కొందరు దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఆస్పత్రుల ప్రశాంతతకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారు. వైద్యులు, సిబ్బందిపై దాడులు సరికాదు. ఆస్పత్రుల్లో భద్రత పెంచాలి.

– డాక్టర్ కల్పనారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, నల్లచెరువు



అమ్మో.. పాము!

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న పాముకాటు బాధితులు
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలకే ప్రమాదం



ఈమె పేరు పుష్ప(27). చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామం. భర్త హరికుమార్‌తో కలిసి కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ నెల 26న ఓ రైతు తోటలో పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబసభ్యులు వెంటనే పుట్టపర్తిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 27న ఆమె మృతి చెందింది.



రొద్దం మండలం ఆర్.కుర్లపల్లికి చెందిన ఇతని పేరు బోయ పార్థ(30). ఈ నెల 25న రాత్రి భార్యతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు పెనుకొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఈ నెల 26న ఉదయం మృతి చెందాడు.

.... ఇలా వర్షాకాలం మొదలైన జూన్ నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 68 మంది పాము కాటుకు గురి కాగా, వీరిలో 20 మంది మృత్యువాతపడ్డారు. పాముకాటు బాధితులు కొందరు ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం అందుకోగా మరికొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు.



కదిరి: 'అమ్మో..పాము' అంటూ జిల్లా వాసులు భయపడే రోజులొచ్చాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పుట్టల్లోకి నీరు చేరడంతో పాములు బయట సంచరిస్తున్నాయి. పొలం గట్ల వెంట, పంట చేను సమీపంలోని ఇళ్లు, గుడిసెలు, ముళ్ల పొదలు, గడ్డివాములు తదితరాలను ఆవాసంగా మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలో రోజూ ఏదో ఒక ప్రాంతంలో పాము కాటు బాధితులు వెలుగులోకి వస్తున్నారు.

అన్నీ విషసర్పాలే కాదు..

కాటేసిన పాములన్నీ విషంతో కూడకున్నవి కాకపోయినా... మనిషి ప్రాణాలు హరించే పాముల పట్ల కొంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు

జిల్లాలో ఈ మూడు నెలల్లో పాముకాటు బాధితులు		
మాసం	బాధితులు	మృతులు
జూన్	23	06
జూలై	26	08
ఆగస్టు	19	06
మొత్తం	68	20

సూచిస్తున్నారు. ఏ పాము కరిచినా వెంటనే స్థానిక పీహెచ్‌సీ, లేదా, పెద్దాస్పత్రికి అంబులెన్స్‌లో బాధితుడిని చేర్చి వైద్యం చేయించడం ఉత్తమం. అయితే చాలా మంది నాటు వైద్యం వైపు మొగ్గు చూపడంతో పరిస్థితి విషమించి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వైద్యులు అంటున్నారు. న్యూరో టాక్సిన్ రకానికి చెందిన నాగుపాము, కట్లపాము కాటు వస్తే నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉందని అంటున్నారు. వీటి విషమం గుండెతో పాటు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. హీమోటాక్సిన్ రకానికి చెందిన రక్త పింజర కాటువేస్తే రక్త నాళాల్లో కణజాలం నశించి బాధితుడు మరణానికి చేరువవుతాడన్నారు. ఏ పాము కరిచిందో స్పష్టంగా చెబితే సరైన చికిత్సతో రోగి ప్రాణాలు కాపాడడం సులవుతుందంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత మేలు..

ఇంటి పరిసరాల్లో పాములు చేరకుండా ఉండేందుకు చెత్త కుప్పలు, ముళ్ల పొదలు లేకుండా పరిశుభ్రత పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి గోడ పక్కన కట్టెలు, ఏ వస్తువులూ ఉంచరాదన్నారు. వాటి సాయంతో పాములు ఇళ్లలోకి ప్రవేశించే ప్రమాదముంటుందన్నారు. ఇంటి బయట రాత్రి సమయంలో వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. చీకట్లో బయటకు వెళ్లాల్సి వస్తే బూట్లు లేదా చెప్పులు ధరించాలని సూచించారు. ముఖ్యంగా రైతులు, రైతు కూలీలు పంట పొలాల్లో పనులకు వెళ్లేటప్పుడు గజ్జెలు కట్టిన చేతి కర్రతో శబ్దం చేస్తూ నడిస్తే పాముల బారిన పడకుండా ఉండవచ్చునని వివరించారు.

వారంలోనే ఇద్దరు..



మా పంచాయతీలో వారం రోజుల్లోనే ఇద్దరు పాముకాటుకు గురయ్యారు. గంజివారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గంగాద్రి చనిపోగా, కొత్తపులవాండ్లపల్లి ఎస్సీ కాలనీ వాసి గంగరాజు ప్రాణాలతో బయటపడ్డాడు. వానాకాలం కావడంతో పాముల బెడద ఎక్కువైంది. పంచాయతీ పరిధిలో రోజూ ఎక్కడో ఓ చోట పాములు కనబడుతూనే ఉన్నాయి.

– వి.మల్లికార్జున, సర్పంచ్, గంజివారిపల్లి, తలుపుల మండలం

అందుబాటులో మందులు

పాముకాటుకు గురైన వారిని వెంటనే ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లాలి. అన్ని పీహెచ్‌సీల్లోనూ ఆస్పత్రుల్లోనూ టీ వీనమ్ ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచాం. నాటు వైద్యం, ఇతర మంత్రాలు... తంత్రాలు అంటూ ఆలస్యం చేస్తే బాధితుడి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది.

– డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్ఓ

వృద్ధురాలి బలవన్మరణం

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లికి చెందిన చంద్రమ్మ (80) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నొప్పి తీవ్రత తాళలేక పురుగుల మందు తాగింది. విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. కాగా, చంద్రమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

400 కిలోల గోమాంసం స్వాధీనం

గోరంట్ల: పట్టణానికి చెందిన ఫకృద్దీన్ బుధవారం ఉదయం తన బొలెరో వాహనంలో గోమాంసాన్ని బెంగళూరుకు తరలిస్తూ గుమ్మయ్యగారిపల్లి సమీపంలో పట్టుబడినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, 400 కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని ఫకృద్దీన్‌తో పాటు డ్రైవర్ వసీం అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం ఫకృద్దీన్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు బుక్కపట్నం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి: అమలాపురం వేదికగా సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్ఎం జగదీష్, పీడీ నాగరాజు బుధవారం తెలిపారు. తమ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు గణేష్‌రెడ్డి, ముక్తియార్ మంగళవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

రైలు నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

ధర్మవరం రూరల్: రైలు నుంచి జారి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని హాసన్ జిల్లా కుంబేనహళ్లికి చెందిన సంజమ్మ (85), తన కోడలు భాగ్యమ్మతో కలసి కొయంబత్తూరు నుంచి బీదర్‌కు రైలులో ప్రయాణమైంది. బుధవారం ధర్మవరం రైల్వే స్టేషన్ దాటి గొల్లపల్లి వద్ద వేగంగా వెళుతున్న రైలులో టాయిలెట్‌కని వెళ్లిన వృద్ధురాలు అదుపు తప్పి ప్రధాన తలుపు నుంచి జారి కిందపడింది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

10 రోజుల్లో సమస్య పరిష్కారం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేష్

- భూ నిర్వాసితులకు ఆర్డీఓ భరోసా

పెనుకొండ: నాసిన్, బెల్ పరిశ్రమల కోసం భూములు కోల్పోయి వారికి 10 రోజుల్లో న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ భాగ్యరేఖ భరోసానిచ్చారు. భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలంటూ పెనుకొండలోని సబ్ కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రెండో రోజూ ఆందోళన కార్యక్రమం కొనసాగింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేష్, ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్ మాట్లాడారు. ఇప్పటికే నిర్మించిన నాసిన్, నిర్మించబోయే బెల్ పరిశ్రమల కోసం పాలసముద్రం, చినబాబయ్యపల్లి, కావేటనాగేపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, పరిహారం చెల్లింపుల్లో అంతులేని నిర్లక్ష్యాన్ని కనబరుస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ భాగ్యరేఖకు వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ.. పూర్తి స్థాయి విచారణ చేపట్టి 10 రోజుల్లో నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, నాయకులు రామాంజినేయులు, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ పాల్గొన్నారు.

ఏపీఎంఎస్‌ను సందర్శించిన డీవైఈఓ

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి అర్బన్: మండలంలోని జగరాజుపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ ఖాదర్‌వలి సాహెబ్ బుధవారం సందర్శించారు. 'చెట్టు కిందే వంట – ఇంటి నుంచే క్యారియర్' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన వారు ఏపీఎంఎస్‌ను చేరుకుని మధ్యాహ్న భోజనంలో నాణ్యత, తాగునీటి ఇబ్బందులను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. అనంతరం హాస్టల్‌లో సమస్యలను గుర్తించారు. మెనూ ప్రకారం వంట చేయాలని, విద్యార్థులు సంతృప్తి చెందేలా భోజనం పెట్టాలని సూచించారు. తగిన వివరాలతో ప్రిన్సిపాల్ రమేష్‌బాబుతో సంజాయిషీ లెటర్ రాయించుకున్నారు. ఇకపై విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని భరోసానిచ్చారు.

పిండినల్లి నివారణ చర్యలు చేపట్టండి

- ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం విద్యార్థుల సూచన

అనంతపురం అగ్రికల్చర్: మల్బరీ (రేషం) తోటల్లో ఇటీవల ఏడాది పొడవునా పిండినల్లి (మీలీబగ్) ఆశించి నష్టపరుస్తోందని, దీని నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు రాప్తాడులోని ప్రాంతీయ పట్టు పరిశోధనా స్థానం (ఆర్ఎస్ఆర్ఎస్) పరిశోధక విద్యార్థులు ఎం.పరశురాముడు, కె.నందిని, వై.ప్రవీణ్‌రెడ్డి, యు.అనిల్‌కుమార్ సూచించారు. ఆర్ఎస్ఆర్ఎస్ జాయింట్ డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుపురుగుల పెంపకం, చీడపీడలు తదితర అంశాలపై పరిశోధన చేస్తున్న వారు.. మల్బరీ తోటల్లో పిండినల్లి నివారణ చర్యలను వివరించారు. మల్బరీ తోటల్లో పిండినల్లి ఆశిస్తే నివారించడం కష్టమన్నారు. ఏడాది పొడవునా ఆశించడానికి అవకాశం ఉందన్నారు. వేసవిలో మరీ ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. దీన్ని తుక్రా అని కూడా పిలుస్తారన్నారు.


మల్బరీ ఆకులకు ఆశించిన పిండినల్లి

వ్యాధి వ్యాప్తి – నివారణ ఇలా..

తుక్రా ఆశించిన ఆకులు ముడుచుకుపోయి తొలుత ముదురు ఆకుపచ్చగా తర్వాత పసుపురంగులోకి మారుతాయన్నారు. కణుపుల మధ్య దూరం తగ్గిపోయి గంట్లు ఏర్పడతాయన్నారు. దీని వల్ల హెక్టారుకు ఏడాదిలో 4,500 కిలోల ఆకు దిగుబడి తగ్గి పట్టు పురుగుల పెంపకంలో సమస్య తలెత్తుతుందన్నారు. దీని జీవితచక్రం పరిశీలిస్తే 350 నుంచి 500 గుడ్లు పెట్టి 6 నుంచి 9 రోజుల్లో పొదుగుతాయన్నారు. 23 నుంచి 27 రోజులు లార్వా దశలో ఉంటాయన్నారు. తర్వాత కీటకంగా మారి మగ పురుగులు 3 నుంచి 4 రోజులు, ఆడ పురుగులు 10 నుంచి 12 రోజుల పాటు జీవిస్తాయన్నారు. వ్యాధి సోకినట్లు గుర్తిస్తే వెంటనే కొడవలి లేదా కత్తెరతో కత్తిరించేసి పాలిథీన్ కవర్లోపెట్టి కాల్చివేయాలన్నారు. అలాగే లీటర్ నీటికి 0.2 శాతం నువాన్ (డీడీవీపీ 76 శాతం ఈసీ) కలిపి పిచికారీ చేయాలన్నారు. పిచికారీ చేసిన 15 నుంచి 17 రోజుల తర్వాత ఆకును వాడుకోవాలన్నారు. లేదంటే జీవనియంత్రణ పద్ధతి కింద 250 కీటకాలైన క్రిప్టోలీమస్ మాంట్రోజరి లేదా 500 కీటకాలైన స్కిమ్నస్ కాక్సివోరాలను రెండు విడతలుగా ఆరు నెలలకోసారి పిండినల్లి ఆశించిన తోటల్లో విడుదల చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు.

బెటాలియన్ కమాండెంట్‌గా ప్రభుకుమార్


బాధ్యతలు చేపడుతున్న ప్రభుకుమార్

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా ప్రభుకుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న అమిత్‌బర్దర్‌ను కోనసీమ జిల్లా ఎస్పీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్నూలులో ఉన్న 2వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రభుకుమార్‌ను పదోన్నతిపై 14 బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరి దుర్మరణం


రాజేష్ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు


శ్రీనివాసులు (ఫైల్)

యాడికి: వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని నారాయణస్వామి కాలనీకి చెందిన శ్రీనివాసులు(33)కు భార్య అనూష, 9 నెలల కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని శ్రీనివాసులు పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తాడిపత్రిలో జరిగిన ఓ వివాహ వేడుకకు నార్పల మండలం నాయనపల్లికి చెందిన రాజేష్ (38)తో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. వేడుక ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు యాడికి గ్రామానికి తిరుగు ప్రయాణమైన వారు పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి టోల్ ప్లాజా సమీపంలో రైల్వే గేటు వద్దకు చేరుకోగానే ఎదురుగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో రాజేష్‌పై శ్రీనివాసులు పడ్డాడు. ఇద్దరి మీదుగా లారీ టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. రాజేష్(38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఘటనపై పెద్దపప్పూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని...


వివేకానంద (ఫైల్)

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ వద్ద వద్ద బుధవారం ఉదయం కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడిని తాడిపత్రి మండలం బోడాయిపల్లికి చెందిన వివేకానంద (18)గా పోలీసులు గుర్తించారు. బేల్దారి పని కోసం బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి వస్తుండగా టెంపో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడి మృతి చెందాడని, ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

స్థలం విషయంలో మోసంపై కేసు

కదిరి టౌన్: పట్టణంలోని నల్లగుట్టవీధిలోని శారదా స్కూల్ వద్ద ఐదు సెంట్ల స్థలం విషయంలో గంటి జయరాం, పద్మశ్రీ తనను మోసం చేశారని బుడిగి నరసింహమూర్తి కుమార్తె మధులత పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు.

వైభవంగా గొటుకూరప్ప పరుష


గొటుకూరప్ప స్వామి


పరుషలో కొలువైన గుడికట్ల దేవుళ్లు


నూతన పూజారిగా బాధ్యతలు తీసుకున్న జోగి గోవర్ధన్

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లిలో 20 ఏళ్ల తర్వాత బుధవారం గొటుకూరప్ప పెద్ద పరుష (జల్ది పూజ) వైభవంగా నిర్వహించారు. రాయలసీమ ప్రాంతంలోని నాలుగు జిల్లాల నుంచి వేలాదిగా స్వామి కాపులు (జోగి, మల్యాల గోత్రం వంశస్తులు) తరలిరావడంతో అయ్యవారిపల్లి జనసంద్రమైంది. కొత్త పూజారిని నియమించే క్రమంలో ఈ పరుషను ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రానికి శ్రీసత్యసాయి జిల్లా తగరకుంట అతకల్లుపట్నం పెదయ్య స్వామి, అనంతపురం జిల్లా కురుగుంట కురుగుంటప్ప, కక్కలపల్లి మదిగుబ్బప్ప స్వామి, బుక్కరాయసముద్రం గుంతకల్లప్ప స్వాములను అయ్యవారిపల్లికి చేర్చారు. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు భక్తిశ్రద్ధలతో జల్ది పూజ జరిగింది. అనంతరం గంగపూజ, అభిషేకాలు నిర్వహించారు. బిందే పూజ చేసి జోగి నాగరాజు కుమారుడు జోగి గోవర్ధన్‌ను నూతన పూజారిగా నియమించారు. గొటుకూరప్ప స్వామి ఎదుట మద్దెలచెరువు గ్రామానికి చెందిన బంగారు వంశస్తులు బలి హరణం నిర్వహించారు. కాగా, పరుషలో కాపులు పటాలు ఎక్కుట కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆనవాయితీ ప్రకారం బంధువులు (పుట్టినింటివాళ్లు) కాపులకు తెచ్చిన నూతన వస్త్రాలను ధరించారు. ఈ కార్యక్రమం కురుబల కుల గురువు కర్తనపర్తి శాంతమూర్తి స్వామి పర్యవేక్షణలో జరిగింది. పరుషలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాప్తాడు సీఐ టీవీ.శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.